సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



లక్కీచాన్స్

సిక్కోలు బౌలర్‌కు లక్కీ చాన్స్ వచ్చింది. మెక్‌గ్రాత్ క్రికెట్ అకాడమీ నుంచి పిలుపు వచ్చింది.

- 8లో



గంజాయి రవాణా గుట్టురట్టు

గంజాయి రవాణా గుట్టును పోలీసులు రట్టు చేశారు. గంజాయి తరలిస్తున్న వారిని పలాసలో పట్టుకున్నారు.

- 8లో

నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్ నిఘా

శ్రీకాకుళం క్రైమ్: నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం శ్రీకాకుళం నగర శివారు ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా నిఘా పెట్టారు. శాంతినగర్ కాలనీ, బలగ తదితర ప్రాంతాలతో పాటు, పట్టణ శివారు ప్రాంతాల్లో నిఘా వేశామని తెలిపారు. పాడుబడిన బంగ్లాలు, నివాస గృహాలను పరిశీలిస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

విచారణ 24కు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో తొలగించిన 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు లేబర్ కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జనవరి 2న ఫిర్యాదు చేయగా, పలు వాయిదాలు పడ్డాయి. శ్రీకాకుళం డే అండ్ నైట్ కూడలిలోని లేబర్ కమిషన్ కార్యాలయంలో శనివారం విచారణ నిర్వహించాల్సి ఉండగా, ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశారు. విచారణ రోజున ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సర్వీస్ ఏజెన్సీ, వర్సిటీ అధికారులు హాజరు కావాలని సూచించారు.

వేకువజామున ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



సత్యవరం కూడలి వద్ద పెట్రోలింగ్ పోలీసు వాహన సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

నరసన్నపేట: రాత్రి సమయాల్లో పోలీసులు పెట్రోలింగ్ సమర్థంగా నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. అలాగే జాతీయ రహదారిపై పెట్రోలింగ్ వాహన సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. శనివారం వేకువజామున ఆయన నరసన్నపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అప్పటికి స్టేషన్‌లో ఉన్న సిబ్బందిని నైట్ డ్యూటీలు, నైట్ పెట్రోలింగ్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్యవరం కూడలి వద్ద జాతీయ రహదారి పెట్రోలింగ్ పోలీసు వాహన సిబ్బందితో మాట్లాడి సూచనలు చేశారు. దొంగతనాలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో పెట్రోలింగ్ మరింత సమర్థంగా నిర్వహించాలన్నారు.

రాజమ్మ తల్లి జాతర రెండోవారం ప్రారంభం



చినవత్సవలస గ్రామంలో పర్యటిస్తున్న శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద

గార: మండలంలోని చినవత్సవలస రాజమ్మ తల్లి రెండో వారం జాతర శనివారం ఉదయం నుంచే ప్రారంభమైంది. ఉత్తరాంధ్ర కాకుండా ఇరు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి రాత్రికి విడిది చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ 130 మంది పోలీసులను బందోబస్తుకు ఏర్పాటు చేశారు. వత్సవలస గ్రామాన్ని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద సాయంత్రం పరిశీలించి బందోబస్తు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవ్‌టీజింగ్, పిక్కాట, పేకాటలు జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.



పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద నిలిపిన లారీలను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం తనిఖీ చేయగా నకిలీ బిల్లులతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నట్టుగా నిర్ధారణ జరిగిన వాహనాలివి. 28 లారీలను తనిఖీ చేస్తే వాటిలో 12 లారీలు నకిలీ బిల్లులతో రవాణా చేసున్నట్టుగా తేలింది. బట్టేరు, బైరి, కాఖండ్యాం, గార ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకతో అక్రమంగా వస్తున్నట్టుగా గుర్తించారు.

సరిహద్దులో లంచావతారం

- ఇసుక అక్రమ రవాణాకు సూత్రధారిగా ఓ అధికారి
- విశాఖలో ఉన్న బిల్డర్లు, లారీ యజమానులతో ఒప్పందం
- జిల్లా నుంచి ఇసుక అక్రమ తరలింపునకు సహకారం
- భారీగా అందుతున్న ముడుపులు
- జేసీ తనిఖీలతో నకిలీ బిల్లుల గుట్టురట్టు

పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద ఇసుక లారీలు ఆపుతున్నారని తెలుసుకుని యూబీ పరిశ్రమ ఎదుట, నెలివాడ, వరిసాం, పైడి భీమవరం ఫ్లై ఓవర్‌కు ముందు నిలిపివేసిన లారీలివి. దాదాపు 50 ఇసుక లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పక్కాగా బిల్లులు ఉంటే ఆపేవారు కాదు.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లా నుంచి నకిలీ బిల్లులతో ఇసుకను ఇష్టానుసారం తరలిస్తున్నారు. జేసీ ఆకస్మిక తనిఖీలతో ఈ విషయం బట్టబయలైంది. ఇన్నాళ్లూ లోప భూయిష్టమైన తనిఖీల కారణంగానే నకిలీల గుట్టు రట్టు కాలేదు. వాస్తవానికి జిల్లాలో నకిలీ బిల్లులతో ఇసుక రవాణా జరుగుతుందనేది బహిరంగ రహస్యం. పత్రికల్లోనూ అనేక మార్లు కథనాలు వచ్చాయి. ఇందులో ఓ అధికారి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. ఆయన ఉన్న ఫలంగా రూ.లక్షలు గడించారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. విశాఖలోని బిల్డర్లు, లారీల యజమానులతో కుమ్మక్కై, జిల్లాలో ఉన్న పలు ఇసుక ర్యాంపులతో ఒప్పందాలు కుదుర్చుకుని పథకం ప్రకారం నకిలీ బిల్లులతో ఇసుక రవాణా చేయిస్తున్నట్టుగా తెలుస్తోంది. బిల్లులు లేకుండా కూడా సరిహద్దు దాటిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

విశాఖ సంబంధాలతో...

ఈ అధికారికి విశాఖలో ఉన్న బిల్డర్లు, లారీ యజమానులతో సత్సంబంధాలు ఉన్నాయి. అదే సమయంలో జిల్లాలోని ఇసుక ర్యాంపుల నిర్వాహకులతో కూడా లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నారు. ముందుగానే ముడుపుల వ్యవహారం కుదుర్చుకుని పథకం ప్రకారం అక్రమ రవాణాకు సహకరిస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేసినప్పుడు వ్యూహాత్మకంగా ర్యాంపుల్లో ఓ ప్రత్యేక పరికరంతో తయారు చేసిన బిల్లులు చూపించి దాటించేస్తున్నారు. జిల్లాలోని ఇసుక ర్యాంపుల వద్ద ఏ రోజుకారోజు ఏయే లారీ నంబర్లతో అధికారికంగా ఇసుక తరలివెళ్తుందో తెలిపే డేటాతో కూడిన లాగిన్ చెక్ పోస్టు సిబ్బంది వద్ద ఉండటం లేదు. దీంతో నకిలీ బిల్లులు గుర్తించలేకపోతున్నారు.



ఎక్కడికక్కడ అనధికారిక ర్యాంపులు

జిల్లాలో అధికారిక ర్యాంపులతో పాటు టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపులు నడుస్తున్నాయి. ఆమదాలవలస, పాతపట్నం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అనధికార ర్యాంపులు కొనసాగుతున్నాయి. పత్రికల్లో కథనాలు వస్తే ఒకటి రెండు రోజులు హడావుడి చేసి, ఆ తర్వాత చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే కొందరు నేతలు కోట్లాది రూపాయలు గడించారు. ఇప్పటికే జిల్లాలో రూ. 500కోట్ల విలువైన ఇసుక అక్రమంగా తరలిపోయిందన్న వాదనలు ఉన్నాయి. పగటి పూట కంటే రాత్రిపూటే ఎక్కువగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5గంటల వరకు ఇసుక లారీల జాతరే జరుగుతోంది. దీన్ని వల్ల పల్లెల్లో రోడ్లు శిథిలమవ్వడమే కాకుండా లారీల రాకపోకలతో ఎప్పుడే ప్రమాదం చోటు చేసుకుంటుందోనన్న భయం కూడా గ్రామాల్లో ఉంది.

క్యాష్ చేసుకుంటున్న అధికారి

అనధికార ర్యాంపుల్లో జరుగుతున్న ఇసుక రవాణాను ఓ అధికారి క్యాష్ చేసుకుంటున్నాడు. అటు విశాఖ బిల్డర్లు, లారీ యజమానులతోనూ, ఇటు ర్యాంపుల నిర్వాహకులను డీల్ కుదుర్చుకుని పక్కా వ్యూహం ప్రకారం జిల్లా నుంచి ఇసుక దాటించేస్తున్నారు. చెక్ పోస్టు వద్ద ఉన్న కదలికలు ఆ అధికారికి ఎప్పటికప్పుడు తెలుస్తూ ఉంటుంది. ఆ సమయంలో చాకచక్యంగా తన అధికారాన్ని ఉపయోగించుకుని జిల్లా నుంచి ఇసుకను సేఫ్‌గా దాటించేస్తున్నారు. తనిఖీలు జరిగినప్పుడు అధికారులపై నాయకుల పేర్లు చెప్పి ఒత్తిడి తీసుకువచ్చి లారీలు విడిపించుకుంటున్నారు. జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలతో ఎప్పటి నుంచో సాగుతున్న అక్రమ రవాణా గుట్టు రట్టు అయింది. నకిలీ బిల్లుల బాగోతం బయటపడింది. అయితే బిల్లుల వెనుక ఎవరు ఉన్నారో తేల్చాల్సి ఉంది.

దేవుడా.. ప్రమాదం తప్పింది

- చెరువులో పడిపోయిన స్కూల్ బస్సు
- స్థానికుల స్పందనతో నిలబడిన విద్యార్థుల ప్రాణాలు
- ఐదుగురు విద్యార్థులకు గాయాలు



చెరువులో పడిన స్కూల్ బస్సు

కాశీబుగ్గ: మందస మండలం ఉమాగిరి వద్ద స్కూల్ బస్సు శనివారం చెరువులో పడిపోయింది. బస్సులో ముప్పై మంది ఉండగా.. ఐదుగురు గాయపడ్డారు. మిగతా వారు క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మందస మండల కేంద్రంలోని వివేకానంద ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు.. 30 మంది విద్యార్థులతో శనివారం సాయంత్రం నాలుగున్నర గంటలకు మందస నుంచి భైరిసారంగిపురం, బెల్లుపటియా, పెడంగో, బుడార్సింగి గ్రామాలకు బయల్దేరింది. ఉమాగిరి వద్ద చెరువు పక్కన కొత్తగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి బస్సు చెరువులో పల్టీ కొట్టింది. దీంతో పిల్లలంతా ఒక్కసారిగా హాహాకారాలు పెట్టారు. అక్కడున్న స్థానికులు వెనువెంటనే స్పందించి పిల్లలను, బస్సు సిబ్బందిని బయటకు తీశారు. చెరువులో నీరు తక్కువగా ఉండడంతో పెద్ద ప్రమాదం జరగలేదు. అయినప్పటికీ బుడార్సింగి, పెడంగో గ్రామాలకు చెందిన ఐదుమంది విద్యార్థులు ఎస్.ధీరజ్, ఎస్.లోకేష్, పవిత్ర పట్నాయక్, హర్షిత, మహేష్ గౌడ్‌లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఉమాగిరి వాసి శిష్టు బాబ్జీతో పాటు స్థానికులు రక్షించారు. 108 సాయంతో గాయపడిన వారిని మందస మండలం హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు డాక్టర్ ఐశ్వర్య, రాజ్యలక్ష్మిలు వైద్యసేవలు అందించారు. మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.



హరిపురం పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థులు

'సంచార పశు ఆరోగ్య సేవలు ఆపేయండి'



వాట్సాప్ మెసేజ్

కాశీబుగ్గ: పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించాలని గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంచార పశు ఆరోగ్యసేవలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి చూస్తోంది. ఉన్న ఫలంగా సంచార పశు ఆరోగ్య సేవలను ఆపేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 19 మే 2022లో ప్రారంభించిన ఫేజ్–1లో 175 వాహనాలు తిరిగి ఆయా ఏడీ కార్యాలయంలో అప్పగించి రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆయా వెహికల్స్‌లో పనిచేస్తున్న పైలెట్, పారావిట్, డాక్టర్, పైలెట్ రిలీవర్లు విధులకు హాజరు కాకూడదని వాట్సాప్‌లో సూచించారు. జిల్లాలో ఫేజ్–1లో 09 వాహనాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు.



ఆదివారం నుంచి నిలిచిపోనున్న ఫేజ్-1 వాహనాలు

ఉత్తరాంధ్ర ఉద్యోగ బాధితుల సమావేశం నేడు

ఆమదాలవలస: ఉత్తరాంధ్ర ఉద్యోగ బాధితుల సమావేశం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో.. 2008 డీఎస్సీ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం పట్టణంలోని కళింగ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ కొత్తకోట శ్రీహరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2004 వ సంవత్సరానికి ముందు వివిధ ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చిన అప్పటి ప్రభుత్వాలు వివిధ కారణాల వల్ల ఉద్యోగ నియామకాలను ఆలస్యం చేశాయని తెలిపారు. అలాగే పాత పింఛన్ అమలు చేయాలని కోరారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో మూడు జిల్లాల బాధిత ఉద్యోగులు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలింపు

సంతబొమ్మాళి: కోటబొమ్మాళికి చెందిన ఒక వ్యాపారి తన వ్యాన్‌లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మర్రిపాడు వద్ద కొంత మంది యువకులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. వ్యాన్‌లో సుమారు 40 బస్తాల బియ్యం ఉన్నాయి. ఈ విషయాన్ని ఆర్‌ఐ ప్రసన్న, మర్రిపాడు వీఆర్‌ఓ ఉమాపతికి ఫోన్‌లో సమాచారం ఇచ్చినా ఘటనా స్థలానికి రాలేదు. సుమారు గంటన్నరకు పైగా పీడీఎస్ బియ్యం ఉన్న వ్యాన్‌ను అడ్డుకున్నా రెవెన్యూ అధికారులు రాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

మూడు రకాల చెత్తలు వేరు చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ప్రజలు మూడు రకాల చెత్తలను వేరు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం కింద కలెక్టర్ బంగ్లాలో శనివారం ఆయన తడి, పొడి, హానికరమైన చెత్తలను వేరు చేసి మున్సిపల్ కార్పొరేషన్ వాహనంలో వేశారు. అక్కడి సిబ్బందికి తడి, పొడి, హానికరమైన చెత్తలపై అవగాహన కల్పించారు.

తడి, పొడి చెత్తలను వేరు చేస్తేనే ప్రాసెసింగ్ చేయవచ్చన్నారు. తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయడం, కంపోస్టు, వర్మీ కంపోస్టు తయారు చేయడం, పొడి చెత్త రీ సైక్లింగ్‌కు పంపిస్తామని చెప్పారు. హానికరమైన చెత్త అంటే డైపర్స్, శానిటరీ న్యాప్‌కిన్స్, మెడిసిన్స్, గాజు, తదితరమైనవి హానికరమైనవని తెలిపారు. వీటిని రెడ్ కలర్ డబ్బాలో వేయాలన్నారు.



చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

డ్వామాలో సంక్షోభంపై కలెక్టర్ ఆరా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా నీటి యాజమాన్య సంస్థలో జరుగుతున్న పరిణామాలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరా తీశారు. నేరుగా పీడీకి ఫోన్ చేసి శాఖలో ఎందుకు వ్యతిరేకత వస్తోందని అడిగారు. ఈ విభాగంలో అవినీతిని అరికట్టేందుకు ప్రయత్నిస్తుంటే వారు తనపై తిరుగుబాటు చేస్తున్నారని ఆయన సమాధానం చెప్పినట్లు తెలిసింది. అయితే కిందిస్థాయి సిబ్బంది అంతా అవినీతిపరులు అన్న పదం వాడడంతో కలెక్టర్‌కు అనుమానం వచ్చి పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

అతిథిదేవోభవ అంటూ..

కవిటి: అతిథి దేవోభవ అన్న ఆర్యోక్తిని కవిటి మండలం ఆర్.భైరిపురం వాసులు చేసి చూపించారు. ఇటలీలోని రోమ్ నగరానికి చెందిన ఎమ్మా ఎన్‌గ్రేసియా అనే యువతి ఇండియాలో కోల్‌కతా నుంచి కేరళ వరకు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. శనివారం బరంపురం నుంచి బయలుదేరి 65 కిలోమీటర్లు ప్రయాణించి రాత్రయ్యే సరికి కవిటి మండలం ఆర్.భైరిపురం చేరుకున్నారు. ఇక్కడ బొర్ర పృథ్వీ అనే యువకుడు ట్రావెలింగ్ కౌచ్ యాప్ ద్వారా ఆమెకు ఆతిథ్యం ఇచ్చాడు. దీంతో ఆమె అచ్చ తెలుగు ఆడపడుచులా మారి వారితో కలిసిపోయారు. తాను ఇప్పటివరకు 951 కిలోమీటర్ల యాత్ర చేశానని, ఇంకా 1800 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉందని తెలిపారు. ఇక్కడ జరిగిన ఓ పెళ్లికి కూడా హాజరై సందడి చేశారు. ఇక్కడి ప్రజల ఆత్మీయత, ఆదరణ తనను మంత్రముగ్ధురాల్ని చేసిందని అన్నారు.



ఆర్.భైరిపురం వీధుల్లో రోడ్లపై విహరిస్తున్న ఎమ్మా ఎన్‌గ్రేసియా

తెలుగుదనం ఉట్టిపడేలా లంగాఓణీలో ఇటాలియన్ ఎమ్మా ఎన్‌గ్రేసియా

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ఉత్తమ డ్రైవర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎస్పీ, అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ బస్సులు డ్రైవింగ్ చేసిన సమయంలో విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ నిజాయితీ, అంకితభావం, క్రమశిక్షణతో డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రాంతీయ రవాణా అధికారి రాజు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ల సేవలను కొనియాడారు. ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. అనంతరం శ్రీకాకుళం 1, 2 డిపోలు, టెక్కలి, పలాస డిపోలలో సుదీర్ఘకాలం ప్రమాద రహిత రికార్డు కలిగిన డ్రైవర్లు బి.వి.ఆర్.మూర్తి, వై.జి.రావు, కె.రమణలకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1–2 డిపో మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ, టెక్కలి డీఎం శ్రీనివాసరావు, పలాస డిపో మేనేజర్ సన్యాసిరావు, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు, భద్రతా దళం – నిఘా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులతో స్నేహపూర్వకంగా మెలగాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారులతో స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బాలల రక్షణ, సంక్షేమం, జువైనల్ జస్టిస్ బోర్డు పనితీరు, పిల్లల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై శనివారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జేజేబీ పనితీరు, ప్రీ లోక్ అదాలత్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం 12 కేసులు రాజీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మంచు జనార్దనరావు, ఎన్ని సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ పరీక్షలు ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ సోయాబ్ అలామ్

శ్రీకాకుళం రూరల్: కేంద్రీయ విద్యాలయంలో సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సోయాబ్ అలామ్ తెలిపారు. పాఠశాలకు చెందిన 119 మంది విద్యార్థులతో పాటు గాయత్రీ స్కూల్‌కు చెందిన మరో 87 మంది ఇదే కేంద్రంలో పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సీసీ కెమెరాల పర్యవేక్షణలో అన్ని వసతుల మధ్య ప్రశాంతంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి మొదటి వారంలో బాలవాటిక నోటిఫికేషన్ ఉంటుందన్నారు. రెండో తరగతి నుంచి 9వ తరగతి వరకూ వ్యాకెన్సీ పొజిషన్ కూడా త్వరలో విడుదలవుతుందని చెప్పారు.

రక్షిత మంచినీటి పథకంలో క్లోరినేషన్



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీపంలోని ఎర్రన్నాయుడు రక్షిత మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పడి శుక్రవారం ఓ వ్యక్తి మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ నీటినే వీధి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం శ్యాంపిల్ టెస్ట్ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో సమ్మర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేపట్టారు. పరిసరాల్లో జంగిల్ క్లియరన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ రామకృష్ణ, ఏఈ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సిక్కోలు బౌలర్‌కు.. లక్కీ చాన్స్

టాలెంట్



- మెక్‌గ్రాత్ క్రికెట్ అకాడమీ సెలక్షన్ ట్రయల్స్‌కు రాజాన జున్నారావు
- మార్చి 13 నుంచి 15 వరకు ఎంపికలు
- ఇప్పటికే అనేక టోర్నీలలో రాణిస్తున్న యువ కెరటం

రాజాన జున్నారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడల ఖిల్లా శ్రీకాకుళం జిల్లా నుంచి మరో క్రికెటర్‌కు అరుదైన అవకాశం లభించింది. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు లెజెండ్, ప్రఖ్యాత పేస్ బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ నిర్వహిస్తున్న ఎంఆర్ఎఫ్ పేస్ అకాడమీ మార్చి 13 నుంచి 15 వరకు చెన్నై వేదికగా సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనుంది. 18 ఏళ్లలోపు పేస్ బౌలర్లను గుర్తించి, ఎంపికచేసే ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు బౌలర్లకు అవకాశం లభించగా.. అందులో ఒకరు మన శ్రీకాకుళం జిల్లావాసి రాజాన జున్నారావు కావడం విశేషం. సెలక్షన్ ట్రయల్స్‌లో ఎంపికైతే జున్నారావు భవిష్యత్తుకు తిరుగులేదని జిల్లా క్రికెట్ సంఘ ప్రతినిధులు భావిస్తున్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు..

పలాస మండలం అల్లుకోల గ్రామానికి చెందిన దినసరి కూలీలు రాజాన జగ్గారావు, చంద్రమ్మల కుమారుడు జున్నారావు. 9వ తరగతిలో ఉండగానే జిల్లాస్థాయి క్రికెట్ సెలక్షన్స్‌లో పాల్గొని మీడియం పేస్ బౌలింగ్‌తో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఏసీఏ 2022, 2023 ఏడాదిల్లో వరుసగా అంతర్‌జిల్లాల అండర్–16 క్రికెట్ టోర్నీలకు ఎంపికై సత్తాచాటాడు.

వినూ మన్కడ్ టోర్నీలో రాణింపు..

2024 అక్టోబర్, నవంబర్‌లో తొలిసారి ఏసీఏ అండర్–19 అంతర్‌జోనల్ త్రీడేస్ మ్యాచ్‌ల్లో పాల్గొని రికార్డుస్థాయిలో 24 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఏసీఏ అండర్–19 అంతర్‌జోనల్ వన్డే టోర్నీల్లో శ్రీకాకుళం జట్టును విజయపథంలో నిలిపాడు. దీంతో బీసీసీఐ నిర్వహించిన ప్రతిష్టాత్మక వినూ మన్కడ్ ట్రోఫీ అండర్–19 అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీకి ఎంపికయ్యాడు. పంజాబ్‌లోని మొహాలి వేదికగా జరిగిన ఈ టోర్నీల్లో 12 వికెట్లు రాణించాడు. హిమాచల్‌ప్రదేశ్‌పై 35 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఆ మ్యాచ్‌ల వీక్షణకు వచ్చిన ఏసీఏ పెద్దలు, సెలక్టర్లు జున్నారావు బౌలింగ్ వేగం, శైలిని ప్రసంశించారు. అదే టోర్నీలో హైదరాబాద్, గోవా, తమిళనాడు, చండీగర్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లో 12 వికెట్లతో మెరిశాడు. 125–128 కి.మీ వేగంతో బంతులను సంధిస్తున్న జున్నారావును సెలక్షన్ ట్రయల్స్ పాల్గొవాలని తాజాగా ఏసీఏకు వర్తమానం అందింది. జున్నారావుకు పిలుపు పట్ల తల్లిదండ్రులతోపాటు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్ రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ ఎస్.రవికుమార్, ఆర్సీ రెడ్డి, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రికెటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకుంటా..

అకాడమిలో రాణించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను. రంజీలు, ఆ తర్వాత ఐపీఎల్‌కు ఎంపికే లక్ష్యంగా ఆడుతున్నాను. నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ సంఘ పెద్దలు, కోచ్‌లకు కృతజ్ఞతలు.

– రాజాన జున్నారావు, యువ క్రికెటర్

కొంగు పట్టు.. బూరె పట్టు



జి.సిగడాం మండలం నాగులవలసలో శనివారం రామాలయం ప్రతిష్టాపనోత్సవం సందర్భంగా శిఖరం పైనుంచి బూరెలు జార విడిచారు. మహిళలు కొంగుపట్టి బూరెలు పట్టారు. ఇలా చేస్తే కుటుంబానికి మేలు జరుగుతుందని ఇక్కడి వారి నమ్మకం. – జి.సిగడాం



బూరెల కోసం కొంగుపడుతున్న మహిళలు

గ్రంథాలయాలతోనే సమాజ చైతన్యం



ప్రసంగిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

శ్రీకాకుళం కల్చరల్: సమాజ చైతన్యానికి గ్రంథాలయాలుతో అవసరమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీకాకుళం ఎన్జీవో హోమ్‌లో శనివారం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలతోనే మేధావి వర్గం తయారవుతుందన్నారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల సెస్ బకాయిలు రూ.710 కోట్లు ఉన్నట్లు వివరించారు. రచయిత అట్టాడ అప్పలనాయడు మాట్లాడుతూ ఒకప్పుడు పంచాయతీల స్థాయిలో గ్రంథాలయాలు ఉండేవని, ఇప్పుడవి కనుమరుగైపోయాయని చెప్పారు. అరసం రాష్ట్ర కార్యదర్శి శరత్ చంద్ర జ్యోతి మాట్లాడుతూ కొత్త తరాల జ్ఞాన వికాసానికి గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం తోడ్పాటునందిస్తుందన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమానికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు నల్లి ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత జామి భీమశంకర్, జీన్ గ్రంథాలయ వ్యవస్థాపకులు పత్తి సుమతి, బూర్జ మండల ఉపాధ్యక్షులు బుడుమూడు సూర్యారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి టి.తిరుపతిరావు, విశ్రాంత ఇంజినీర్ బి.ఎ. మోహనరావు, ఇస్కాఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి.మల్లేశ్వరరావు, జి.వి. నాగభూషణరావు, పాలకొండ డివిజన్ గ్రంథాలయ ఉద్యమ నాయకులు సుబ్బా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత



తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీఓ కృష్ణమూర్తి

టెక్కలి: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పంచాయతీ పరిశుభ్రతపై శనివారం టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తితో కలిసి టెక్కలిలో పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నిర్వహణ తీరు సరిగ్గా లేకపోవడంతో ఈఓ జగన్నాథంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సమీప ఇళ్ల వద్దకు వెళ్లి తడి చెత్త పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. పట్టుమహాదేవి కోనేరును పరిశీలించి పార్కుగా చేసే క్రమంలో పూర్తి స్థాయి నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టెక్కలి పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పంచాయతీను సుందరంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య కార్మికులు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ భారతి సౌజన్య, వంశధార డీఈఈ శేఖర్‌బాబు, డ్వామా ఏపీడీ శైలజ, జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ నిశ్చల, ఎంపీడీఓ సీహెచ్.లక్ష్మీబాయి, డీఎల్‌పీఓ గోపి బాల, ఏపీఎం బి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి రైతు దుర్మరణం



ప్రమాదానికి గురైన ట్రాక్టర్



తమ్మినేని భాస్కరరావు (ఫైల్)

పొందూరు/ఆమదాలవలస రూరల్: ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి చెందిన ఘటన ఆమదాలవలస మండలం బెలమాం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పొందూరు మండలం తాడివలసకు చెందిన తమ్మినేని భాస్కరరావు(51) తనకు ఉన్న ఎకరా పొలంతో పాటు సుమారు ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి దుక్కులు దున్నడం, పొలం పనులు చేయడం వంటి పనులు చేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం 5 గంటలకు వ్యవసాయ పనుల కోసం సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న ఆమదాలవలస మండలం బెలమాం గ్రామంలోని పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్‌పై వెళ్లాడు. పొలం లోతట్టులో ఉండటంతో ట్రాక్టర్ బోల్తా పడి భాస్కరరావు కిందనే చిక్కుకుపోయాడు. స్థానికులు గుర్తించి బయటకు తీసేసరికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భార్య రమణమ్మ అక్కడికక్కడే కుప్పకూలింది. ఆమదాలవలస ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు



విజేతలైన విద్యార్థులతో డీఆర్‌వో, రవాణా శాఖ అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రహదారి భద్రతపై పలువురు నిపుణులు, అధికారులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ ఏడాది జిల్లాలో 889 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వాటిలో 285 మంది మరణించగా, 1043 మంది గాయపడ్డారని అధికారులు వివరించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ విజయసారథి, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, డీఎంహెచ్ఓ టీవీ బాలమురళీకృష్ణ, జిల్లా అగ్నిమాపక అధికారి మోహన్‌రావు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు పి.వి.గంగాధర్, ఆర్.అనిల్, మున్సిపల్ ఇంజినీర్ దక్షిణామూర్తి, నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ ఉజ్వల్, రవాణా శాఖ అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలు వీరే :

క్విజ్: కె.లోహిత(కేజీబీవీ, గార), ఎస్.రేఖ(కేజీబీవీ, గార), బి.రాజానందిని (శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, శ్రీకాకుళం), జి.హితేష్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, శ్రీకాకుళం).

వ్యాసరచన: టి.హారిక (బీఎస్సీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి), ఎ.సూర్య (బీఎస్సీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి), పి.రేణుశ్రీ (డిగ్రీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట), కె.రాము (డిగ్రీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట), జె. ఝాన్సీరాణి (సెయింట్ క్లారెట్ ఇ.ఎం. పాఠశాల, నరసన్నపేట), జె.హోయ్ (9వ తరగతి) – సెయింట్ క్లారెట్ ఇ.ఎం. పాఠశాల, నరసన్నపేట), యు.మానస (సెయింట్ క్లారెట్), డి.సింధూర (సెయింట్ క్లారెట్), కె.హారిక (బీఎస్సీ, గాయత్రీ కళాశాల, మునసబ్‌పేట), ఎం.జోష్నవి (గాయత్రీ కళాశాల), డి.మేనక (గాయత్రీ కళాశాల), టి.తైవేస్ (ఆదిత్య డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం), హాసిని (డిగ్రీ)(ఆదిత్య డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం)

గంజాయి రవాణా గుట్టురట్టు



కాశీబుగ్గ: గంజాయితో పట్టుబడిన నిందితులతో డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ సూర్యనారాయణ


కాశీబుగ్గ: ఒడిశా నుంచి ముంబైకు గంజాయి తరలించేందుకు ప్రయత్నించిన నలుగురు ఒడిశా వాసులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. శనివారం కాశీబుగ్గ పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ వెంకట అప్పారావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గంజాం జిల్లా బుర్దైపహాడా గ్రామానికి చెందిన బిక్రమ్ మండల్, సునంద సవరలు 8 కేజీల గంజాయిని ముంబై తరలించేందుకు పలాస రైల్వే స్టేషన్‌కు రాగా పోలీసులు పట్టుకున్నారు. అదే విధంగా, ఒడిశా రాష్ట్రం గండాహాతి వాటర్ ఫాల్స్ సమీపంలో గంజాయిని పండించి అందులో మూడు కేజీల అమ్మేందుకు పలాస రైల్వేస్టేషన్‌కు వచ్చిన గంగవైన ఉదయకుమార్, గౌరవ్ పారివా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని కలిసేందుకు వచ్చిన మరో ఇద్దరు పరారయ్యారు. రెండు కేసుల్లో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు కేజీల గంజాయితో..

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి ముంబైకు గంజాయి అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలిస్తున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా అంతర్భఅదవచుడంగపూర్ గ్రామానికి చెందిన మిలన్ పరిచ్చా అనే యువకుడు అదే రాష్ట్రానికి చెందిన చంద్రు అనే వ్యక్తి వద్ద 6.220 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు.

బరంపురంలో బస్సు ఎక్కి ఇచ్ఛాపురం చేరుకున్నాడు. అనంతరం బెంగళూరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గంజాయితోపాటు సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ముంబైలో గంజాయి వ్యాపారి ప్రేమానంద్‌మల్లిక్‌కు అందజేసేందుకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సమావేశంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సై ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతుడు నవీన్

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుశాలపురం సమీపంలో బైపాస్ కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర నవీన్ (21) అనే యువకుడు మృతి చెందాడు. బంధువుల అమ్మాయితో కలిసి బైక్‌పై విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తుండగా వేకువజామున 5.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే బైకు అదుపు తప్పిందా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందా అనే విషయం తెలియడం లేదు. అంబులెన్స్ వచ్చేలోగానే నవీన్ మృతి చెందగా.. యువతి స్వల్ప గాయాలతో బయటపడింది. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించిన పోలీసులు.. గాయపడిన యువతిని శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కుడ్డపల్లి. తండ్రి అనప పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ గత ఏడాది ఫిబ్రవరిలో అనారోగ్యంతో మృతి చెందారు. సరిగ్గా ఏడాదికే కుమారుడు కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు దాసరి భీమయ్య

నందిగాం: మండలంలోని కొత్తగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పలాస మండలం రేగులపాడుకు చెందిన దాసరి భీమయ్య(65) నందిగాం మండలం భోరుభద్రలోని బంధువుల ఇంట్లో జరగనున్న గావు సంబరం కోసం కాలినడకన బయలుదేరాడు. కొత్తగ్రహారం వద్దకు వచ్చేసరికి టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన భీమయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భీమయ్యకు భార్య తులసమ్మ, వివాహమైన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తులసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు



గాయపడిన శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి బైక్‌పై వెళుతున్న ఉపాధ్యాయుడు సింగూరు శ్రీనివాసరావు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దోమాం పంచాయతీ బమ్మిడివానిపేటకు చెందిన ఈ ఉపాధ్యాయుడు కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు సమీపంలోని సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా వెనుక నుంచి బస్సు ఢీకొట్టింది. బస్సు బ్రేక్ వేయటంతో ఉపాధ్యాయుడు రోడ్డుపై పడిపోయారు. హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం తప్పింది. కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.